వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
శుక్రవారం, జులై 31, 2026

# కార్మికుల రక్షణ కోసమే 'తెలంగాణ రక్షణ ట్రేడ్ యూనియన్'

## కల్వకుంట్ల కవిత




**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కార్మికుల సంక్షేమం, భద్రత ధ్యేయంగా 'తెలంగాణ రక్షణ ట్రేడ్ యూనియన్' ఆవిర్భవించిందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రక్షణ ట్రేడ్ యూనియన్ లోగోను ఆమె ఆవిష్కరించి, కార్మిక లోకానికి అంకితం చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడిన ముఖ్యాంశాలు ఆమె మాటల్లోనే... "మాది పూర్తిగా కార్మికుల ఫ్రెండ్లీ పార్టీ. రాబోయే రోజుల్లో మేము అధికారంలోకి వస్తే, ఇది కచ్చితంగా కార్మికుల ఫ్రెండ్లీ ప్రభుత్వంగా మారుతుంది. మా ట్రేడ్ యూనియన్ లోగోలో ఒకవైపు పెన్ను, మరోవైపు పాణా ఉన్నాయి. అంటే అన్ని రంగాల కార్మికులు, ఉద్యోగులకు మేము ఎప్పుడూ అండగా ఉంటామని దీని అర్థం. దేశంలో లేబర్ చట్టాలు, కార్మికుల హక్కులను కాలరాసే కుట్ర జరుగుతోంది. 1926 నుంచి అమల్లో ఉన్న చట్టాలను తుంగలో తొక్కి మోదీ ప్రభుత్వం కొత్త లేబర్ కోడ్‌లను తెస్తోంది. ఈ చట్టాలను అమలు చేసేది లేదని పశ్చిమ బెంగాల్, తమిళనాడు లాంటి రాష్ట్రాలు స్పష్టం చేసినట్లే.. మన రాష్ట్రంలోనూ అసెంబ్లీలో తీర్మానం చేయాలి. ప్రభుత్వమే అందరికంటే ఎక్కువగా శ్రమ దోపిడీకి పాల్పడుతోంది. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు ధర్నాలు చేసే దుస్థితి తెచ్చారు. ప్రశ్నిస్తే బెదిరింపులు, కేసులు పెడుతున్నారు. ప్రైవేట్ శక్తులకు ప్రభుత్వమే దోపిడీ మార్గాన్ని చూపుతోంది. మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్నప్పుడు షెడ్యూల్డ్ ఇండస్ట్రీస్ కార్మికులకు కనీస వేతనం రూ. 20,000 ఉండాలని రేవంత్ రెడ్డి అప్పట్లో కేసీఆర్‌కు లేఖ రాశారు. కానీ ఇప్పుడు సీఎం అయ్యాక రూ. 16,000 ఇస్తామనడం అన్యాయం. కార్మికులకు కనీస వేతనం రూ. 26,000 ఉండాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రభుత్వం ఆటో డ్రైవర్లను టెర్రరిస్టుల మాదిరిగా చూస్తోంది. దొంగచాటుగా దాక్కొని చలాన్లు వేయడం దారుణం. వారి కష్టమంతా చలాన్లకే సరిపోతోంది. ఐటీ, ఫార్మా రంగాల్లోనూ యూనియన్ల అవసరం ఉంది. ఇటీవల జీనోమ్ వ్యాలీలో 200 మంది తెలుగు ఉద్యోగులను ఎలాంటి నోటీసులు లేకుండా తొలగించారు. యూనియన్లు లేకపోవడం వల్లే ఇలాంటి అన్యాయం జరుగుతోంది. ఐటీ ఉద్యోగుల ఉద్యోగ భద్రత కోసం మా పార్టీలో ప్రత్యేక వింగ్ ఏర్పాటు చేశాం. రాజ్యాంగబద్ధంగా మాకు దక్కిన హక్కుల సాధన కోసం, కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల రక్షణ కోసం తెలంగాణ రక్షణ ట్రేడ్ యూనియన్ నిరంతరం పోరాడుతుందని కవిత స్పష్టం చేశారు.




# రేషన్ కార్డు ఈ-కేవైసీ హెల్ప్‌డెస్క్ పరిశీలన

### అందుతున్న సేవలపై ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఆరా



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని కృష్ణానగర్ డివిజన్, కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో ఏర్పాటు చేసిన రేషన్ కార్డు ఈ-కేవైసీ హెల్ప్‌డెస్క్‌ను జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ పరిశీలించారు. కృష్ణానగర్ డివిజన్ అధ్యక్షులు అబ్దుల్ రజాక్ ఖాన్ (ఫిరోజ్ ఖాన్), పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన ఈ కేంద్రానికి విచ్చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకుంటున్న తీరును ఆయన స్వయంగా పరిశీలించారు. హెల్ప్‌డెస్క్ వద్ద ప్రజలకు అందుతున్న వసతులు, సహాయ సహకారాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.అర్హులైన ప్రతి ఒక్కరూ ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా సులువుగా ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకునేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# ఘనంగా ఉమేష్ కుమార్ పదవీ విరమణ



**మామునూరు, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మామునూరు నాల్గవ బెటాలియన్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించిన పి.ఉమేష్ కుమార్ పదవీ విరమణోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, పదవీ విరమణ పొందుతున్న ఉమేష్ కుమార్‌ను ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. ఉమేష్ కుమార్ జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరి, అంచెలంచెలుగా సీనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పదోన్నతులు పొందారని తెలిపారు. మొదటి పోస్టింగ్ సీపీవో కరీంనగర్ కాగా.. ఆ తర్వాత పీటీసీ కరీంనగర్, సీపీ కరీంనగర్, 13వ బెటాలియన్‌లో సుదీర్ఘకాలం విధులు నిర్వర్తించారు. చివరగా 4వ బెటాలియన్‌లో తన సర్వీస్ కాలం మొత్తంలో ఎలాంటి రిమార్క్స్ లేకుండా అత్యంత నిబద్ధతతో విధులు నిర్వర్తించి, రిటైర్ కావడం అభినందనీయమని కొనియాడారు. ఉమేష్ కుమార్ సతీమణి సుధారాణి, కుమార్తెలు సాయి నికిత, శ్రీ చందనలతో కూడిన ఆయన కుటుంబం పదవీ విరమణ తర్వాత ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని కమాండెంట్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ కే.బాలయ్య, ఈ.వీరన్న, రిజర్వు ఇన్స్పెక్టర్లు విజయ్, కార్తీక్, రవి, సర్వర్, వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్, కృష్ణ, అలాగే ఇతర బెటాలియన్ అధికారులు, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది తదితరులు పాల్గొని ఉమేష్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



# కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన తెలంగాణ బీజేపీ ఎంపీలు

- **తెలంగాణకు మరిన్ని నిధులు కోరిన ఎంపీ ఈటల రాజేందర్**

**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ & రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు సహచర తెలంగాణ బీజేపీ ఎంపీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ మరియు పేదల సొంత ఇంటి కల సాకారం కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి మరింత సహకారం అందించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రానికి మరిన్ని గ్రామీణ రహదారులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన పేద కుటుంబాలకు అధిక సంఖ్యలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ఇళ్లను కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీ శ్రీ ఈటల రాజేందర్‌తో పాటు బీజేపీ ఎంపీలు డి.కె.అరుణ, మాధవనేని రఘునందన్ రావు, గోడం నగేష్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.